సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025



విశాఖలో ముగిసిన ప్రో కబడ్డీ లీగ్ 8లో



'సెయింట్ జోసెఫ్' ప్రపంచ రికార్డు 8లో



దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు 8లో

న్యూస్‌రీల్

ఈపీడీసీఎల్ సీవీవోగా మరోసారి కింజరాపు



సీఎండీని కలిసిన కేవీఆర్ ప్రసాద్

సాక్షి, విశాఖపట్నం : ఏపీఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారి(సీవీవో)గా రిటైర్డ్ ఎస్పీ కింజరాపు వెంకట రామకృష్ణప్రసాద్‌ను మరోసారి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2024 **ఆగస్టు నుంచి ఈ** ఏడాది జూలై 31 వరకూ **సీవీవోగా విధులు** నిర్వర్తించారు. మరోసారి కాం**ట్రాక్టు పద్ధతిలో** మరో ఏడాదిపాటు నియమి**స్తున్నట్లు ఇంధన** శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి **కె.విజయానంద్** ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సం**దర్భంగా ఆయన** సీఎండీ పృథ్వీతేజ్‌ని మర్యా**దపూర్వకంగా కలి**శారు. అనంతరం విజిలెన్స్ వి**భాగంలో సీవీవోగా** అధికారికంగా బాధ్యతలు చేప**ట్టారు.**

భారత అంధుల క్రికెట్ జట్టులో విశాఖ అమ్మాయి



విశాఖ స్పోర్ట్స్: విశాఖపట్నానికి చెందిన పాంగి కరుణకుమారి భారత్‌లో తొలిసారిగా జరగనున్న మహిళల టీ–20 ప్రపంచ అంధుల క్రికెట్ కప్‌లో ఆడనుంది. నవంబర్ 11 నుంచి 25 వరకు న్యూఢిల్లీ, బెంగళూరులలో ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ టోర్నమెంట్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, నేపాల్, పాకిస్థాన్, శ్రీలంక, అమెరికా దేశాలతో పాటు భారత్ కూడా పాల్గొంటోంది. టోర్నమెంట్ విజేతను నిర్ణయించడానికి లీగ్ దశలో 21 మ్యాచ్‌లు, ఆ తర్వాత నాకౌట్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. భారత మహిళల అంధుల క్రికెట్ జట్టులో స్థానం సంపాదించిన కరుణకుమారి ప్రస్తుతం విశాఖలోని ప్రభుత్వ అంధుల బాలికల పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది.

25న తపాలా అదాలత్

ఎంవీపీకాలనీ : తపాలా వినియోగదారుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఈ నెల 25న ఎంవీపీకాలనీలోని రీజనల్ కార్యాలయంలో 119వ తపాలా అదాలత్ నిర్వహించనున్నట్లు రీజనల్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ కేవీడీ సాగర్ తెలిపారు. ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన తపాలా వినియోగదారులు వారి సమస్యలను ఈ నెల 22లోపు అందజేయాలన్నారు.



ప్రెస్‌మీట్ కవర్ చేస్తే కేసులు పెడతారా?



రాజకీయ పార్టీల నాయకుల స్టేట్‌మెంట్లు పత్రికలో పబ్లిష్ చేస్తే రిపోర్టర్లు, ఎడిటర్‌పై కేసులు పెడతారా? రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్రపు హక్కు లేదా? మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామనే విషయాన్ని మరచిపోకూడదు. రాజ్యాంగంలో ఆర్టికల్ 19(1)ఎ ప్రకారం జర్నలిస్టుల హక్కులకు రక్షణ ఉంది. ప్రజల పక్షాన గళమెత్తుతున్న 'సాక్షి' గొంతు నులిమే చర్య ఇది. పత్రికా స్వేచ్ఛను కాలరాసే విధానాలు ప్రభుత్వం మానుకోవాలి. ఏదైనా సమస్య ఉంటే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయాలి. రీజాయిండర్ **ఇవ్వాలి. కానీ పత్రికలపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ఇలాంటి సంస్కృతికి బీజం నాటడం భవిష్యత్తులో నిజాన్ని అణగదొక్కినట్లే అవుతుంది. – బూడి ముత్యాలనాయుడు, మాజీ డిప్యూటీ సీఎం**

పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్రపు హక్కు లేదా?



రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోంది. మొదటి నుంచి కూటమి ప్రభుత్వం వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న 'సాక్షి'పై వేధింపులకు పాల్పడుతుంది. ఒక రాజకీయ పార్టీ నేత ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన మాటలను రిపోర్టర్ వార్తగా రాస్తే ఎడిటర్‌పై కేసు పెడతారా? మీడియా గొంతును నులిమేస్తారా? రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్రపు హక్కు లేదా..? అక్షరాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను నోటీసులు, అక్రమ కేసులతో నిరోధించలేరు. రాజకీయ కక్షలు కార్పణ్యాలతో పత్రికా ఎడిటర్‌పై కేసుల నమోదు ఏమాత్రం సరికాదు. రాష్ట్రంలో కూటమి **ప్రభుత్వానికి** డబ్బా కొట్టే పచ్చ మీడియా మాత్రమే ఉండాలా? మీ అవినీతి, అక్రమాలను ఎత్తిచూపించే ఇంకే ఏ **మీడియా ఉం**డకూడదా.. అయినా మీకెందుకంత ఉలికిపాటు. – **గుడివాడ అమర్‌నాథ్**, మాజీ మంత్రి

ఉక్కుకు ఉచ్చు?

రూ.3లక్షల కోట్ల ఆస్తి భద్రత ప్రశ్నార్థకం



ఆగస్టు 25.. స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్ ఫర్నేస్–3 పునరుద్ధరణ కోసం భద్రపరిచిన భారీ కాపర్ స్టేవ్స్ చోరీకి గురయ్యాయి. ఒక్కొక్కటి 1,200 నుంచి 1,400 కిలోల బరువుండే ఆరు స్టేవ్స్ మాయమయ్యాయి. వీటి విలువ సుమారు రూ.50లక్షలకు పైగా ఉంటుందని అంచనా.

సెప్టెంబర్ 10.. స్టీల్‌ప్లాంట్ రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌ఎంహెచ్‌పీ) విభాగంలో గుర్తుతెలియని వ్యక్తులు కన్వేయర్ బెల్ట్‌ను కోసేశారు. సిబ్బంది విధి నిర్వహణలో భాగంగా కన్వేయర్‌ను ప్రారంభించగా, బెల్ట్ కొంత భాగం తెగి ఉండటాన్ని గమనించి, అది పూర్తిగా ధ్వంసం కాకముందే నిలిపివేశారు.

విశాఖ ఉక్కు కర్మాగారంలో ఇటీవలి కాలంలో చోటుచేసుకుంటున్న ఈ ఘటనలు కార్మికులు, ఉద్యోగ సంఘాల్లో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తున్నాయి. ప్రైవేటీకరణ కుట్రలో భాగంగానే యాజమాన్యం భద్రతను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- రాగి స్టేవ్‌లు ఎలా మాయమయ్యాయి
- కన్వేయర్ బెల్ట్‌లను కోసిందెవరు?
- వరుస ఘటనలతో ఆందోళనలో స్టీల్‌ప్లాంట్ కార్మికులు
- ఉక్కు ఆస్తులకు ఎసరు పెడుతున్నదెవరు?
- యాజమాన్య నిర్లక్ష్యమా? పాలకుల కుట్రా?

సాక్షి, విశాఖపట్నం: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేస్తున్న కుయుక్తులు ఉక్కు పరిశ్రమకు కొత్త చిక్కులు తెచ్చిపెడుతున్నాయి. సంవత్సరాలుగా ఉద్యోగ, కార్మిక సంఘాలు తమ కుటుంబాలతో కలిసి రోడ్లపై పోరాటాలు చేస్తున్నా.. కేంద్రం తన పని తాను చేసుకుపోతోంది. ఒక్కో విభాగాన్ని ప్రైవేటీకరణ చేయడానికి చకచకా పావులు కదుపుతోంది. ఖర్చుల తగ్గింపులో భాగంగా స్వచ్ఛంద పదవీ విరమణ పేరుతో ఉద్యోగులను, వేలాది మంది కార్మికులను విడతల వారీగా విధుల నుంచి తొలగించేసింది. ఇదే విధంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో భద్రతా సిబ్బందిపైనా వేటు పడింది. ఈ నేపథ్యంలో ప్లాంట్‌లో భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

భారీగా తగ్గిన సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది

దేశంలోని పార్లమెంట్, విమానాశ్రయాలు వంటి అత్యంత కీలకమైన సంస్థలకు రక్షణ కల్పించే సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్‌ఎఫ్) విశాఖ ఉక్కు కర్మాగారానికి 1983 ఆగస్టు నుంచి భద్రత కల్పిస్తోంది. రూ.3 లక్షల కోట్ల విలువైన ప్లాంట్ ఆస్తులు, యంత్రాలు, ముడి పదార్థాలను సుమారు 40 ఏళ్లుగా సుమారు 1,013 మంది సిబ్బంది కంటికి రెప్పలా కాపాడారు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరిలో 'డిప్లాయ్‌మెంట్ కాస్ట్ కటింగ్' పేరుతో యాజమాన్యం సీఐఎస్‌ఎఫ్ సిబ్బందిని భారీగా తగ్గించింది. మొత్తం 1013 మందిలో ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు వంటి హోదాలో ఉన్న 438 మందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ప్రస్తుతం కేవలం 575 మంది సిబ్బంది మాత్రమే విధుల్లో ఉన్నారు. సిబ్బందిని తగ్గించిన తర్వాత ప్రత్యామ్నాయ భద్రతా ఏర్పాట్లు చేయడంలో యాజమాన్యం మీనమేషాలు లెక్కిస్తోందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

యాజమాన్య నిర్లక్ష్యం.. ప్రైవేటీకరణ కుట్ర

కేంద్ర ప్రభుత్వం ప్లాంట్ ప్రైవేటీకరణకు మొగ్గు చూపడం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అందుకు వత్తాసు పలకడంతోనే యాజమాన్యం ప్లాంట్ భద్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఒక ఉద్యోగి ప్లాంట్‌లోకి వెళ్లి బయటకు రావాలంటే సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది డేగ కళ్లతో పహారా కాసేవారు. లోపలకు వెళ్లి.. బయటకు వచ్చేటప్పుడు ఉద్యోగి చేతిలో అదనపు వస్తువు ఏదైనా కనిపించినా ఆరా తీసేవారు. ఇప్పుడు సిబ్బంది కొరత కారణంగా భద్రతా ప్రమాణాలు పడిపోయాయి. ఒక్కొక్కటి 1,400 కిలోల బరువున్న కాపర్ స్టేవ్స్ చోరీకి గురైనా గుర్తించలేకపోవడం, అత్యంత కీలకమైన ఆర్‌ఎంహెచ్‌సీ విభాగంలో కనీసం సీసీ కెమెరాలు కూడా లేకపోవడం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని ఉద్యోగ, కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఈ వరుస ఘటనల వెనుక ప్రైవేటీకరణకు మార్గం సుగమం చేసే కుట్ర దాగి ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్లాంట్ భద్రతా వ్యవస్థను బలహీనం చేశారు



స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దొడ్డిదారిన దోచుకోవడానికి పెద్దస్థాయిలో కుట్ర జరుగుతోంది. భద్రతా వలయంలో ఉంటూ నిరంతరం రూ.వేల కోట్ల ఉత్పత్తులున్న చోట.. బయట వాహనాల్లో వచ్చి చోరీ చేస్తే.. ప్లాంట్‌లో ఏదో జరుగుతోందని అర్థమవుతోంది. కాపర్ స్టేవ్స్ ఒక్కో ప్లేట్ 1.4 టన్నుల బరువు ఉంటుంది. వాటిని ఎత్తాలంటే హైడ్రాలిక్ క్రేన్, లారీ అవసరం. అలాంటివి ఆరు కాపర్ స్టేవ్‌లు మాయమయ్యాయి. ఈ నేరానికి పాల్పడినవారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలి. సీఐఎస్‌ఎఫ్ సిబ్బందిని బదిలీ చేసి, సెక్యూరిటీని బలహీనపరిచారు. ప్రజల ఆస్తులకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాల్సిన చోట, యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. సీఐఎస్‌ఎఫ్ సిబ్బందిని బదిలీ చేసిన తర్వాత ఇంతవరకూ ప్రత్యామ్నాయ భద్రతా ఏర్పాట్లు చేయకపోవడం గర్హనీయం.

– అయోధ్యరామ్, కన్వీనర్, విశాఖ ఉక్కు పోరాట కమిటీ

ట్రాఫిక్ కష్టాలకు ఏఐతో చెక్

- 'ప్రాజెక్టు సారథి' విజయవంతం
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



సేకరించిన డేటాను వివరిస్తున్న కంపెనీ ప్రతినిధి

దాబాగార్డెన్స్: నగరంలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించి, శాంతిభద్రతలను మెరుగుపరిచే లక్ష్యంతో జీవీఎంసీ, నగర పోలీస్ శాఖ సంయుక్తంగా ప్రాజెక్టు సారథి అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా పనిచేసే ఈ ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐటీఎంఎస్) ద్వారా నగరంలో ట్రాఫిక్ నిర్వహణను సమూలంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఇతర ఉన్నతాధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ప్రాజెక్టు సారథి పురోగతిని సమీక్షించారు. నగరంలోని ఐదు కీలక ప్రాంతాల్లో ఐదు వేర్వేరు సంస్థల ద్వారా పైలట్ ప్రాజెక్టును విజయవంతంగా నిర్వహించినట్లు కమిషనర్ వివరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నిషన్, రెడ్ లైట్ వైలేషన్ డిటెక్షన్, ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్‌ను ద్వారా డేటాను సేకరించినట్లు వెల్లడించారు. పైలట్ ప్రాజెక్టులో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు తాము సేకరించిన డేటాను, ఫలితాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు, శాంతిభద్రతల పరిరక్షణకు మరిన్ని అంశాలను జోడించాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టులో నెల రోజుల పాటు నమోదైన ఫలితాలను సమీక్షించి, నగరం మొత్తం ఈ వ్యవస్థను విస్తరించేందుకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అమలైతే నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పర్యవేక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ మరింత సులభతరం అవుతుందని సీపీ అన్నారు.

ఆటోడ్రైవర్లకు 'బ్యాడ్జ్' షరతు దారుణం

- అర్హులందరికీ వాహనమిత్ర అమలు చేయాలి
- ఉపాధి కల్పించాలని ఆటోలతో నిరసన ప్రదర్శన



కలెక్టరేట్‌కు ఆటోల్లో ర్యాలీగా వెళ్తున్న డ్రైవర్లు



తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆటోడ్రైవర్లు

బీచ్‌రోడ్డు/మహారాణిపేట : తమకు ఆర్థిక సహాయం అందించే పథకంలో బ్యాడ్జ్ తప్పనిసరి అనే నిబంధన పెట్టడం సరికాదని ఆటోడ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి జగదాంబ సెంటర్ మీదుగా కలెక్టరేట్ కార్యాలయం వరకు గురువారం ఆటోలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అనంతపురం సభలో ప్రకటించిన రూ.15వేల ఆర్థిక సహాయం పథకానికి బ్యాడ్జ్ ఉండాలనే షరతు పెట్టడం దారుణమన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం డ్రైవర్ల బ్యాడ్జిలను, నంబర్లను రద్దు చేసిందని గుర్తు చేశారు. వాహన మిత్ర పథకాన్ని అర్హత ఉన్న డ్రైవర్లందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి బహుళజాతి కంపెనీల యాప్ ఆధారిత టూవీలర్ రవాణా సేవలు ఆటో డ్రైవర్ల ఉపాధికి ముప్పుగా మారాయన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఈ సేవలను రద్దు చేసినా.. మన రాష్ట్రంలో వాటిని కొనసాగించడం వల్ల ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే టూవీలర్ యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

'స్త్రీ శక్తి' పథకంతో తగ్గిన ఆదాయం

స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల ఆటో మోటార్ కార్మికుల ఆదాయం 80 శాతం తగ్గిపోయిందని రమణ తెలిపారు. దీని వల్ల పిల్లల స్కూల్ ఫీజులు, కరెంట్ బిల్లులు, ఇంటి అద్దెలు వంటివి కట్టలేని దీనస్థితిలో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నంబర్ 21, 31ల ద్వారా భారీ జరిమానాలు విధించడం కూడా ఆర్థిక భారాన్ని పెంచుతోందన్నారు. ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ మాట్లాడుతూ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల వల్ల డ్రైవర్లు మరింత ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెట్రోల్, డీజిల్, సీఎన్జీ గ్యాస్‌పై 50 శాతం రాయితీ ఇవ్వాలని, ఈ–చలానా కేసులను ఎత్తివేయాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ప్రమాదంలో డ్రైవర్ చనిపోతే రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ నాయకులు ఎస్ మధు రెడ్డి, అడ్డూరి శంకర్, లండ అప్పారావు, దల్లి నాని, లంకా గోవింద్ సూరిబాబు, కెల్లా రమణ, సింహాచలం, భాషా, రాంబాబు తదితరులు పాల్గొన్నారు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను సమైక్యంగా అడ్డుకుందాం

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి బేబీ





ప్రసంగిస్తున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, బహిరంగ సభలో పాల్గొన్న జనం

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ సమైక్యంగా అడ్డుకుందామని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గాజువాకలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వంటిల్లు జంక్షన్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రధాని మోదీ అమ్మడానికి ప్రయత్నిస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు మద్దతుగా ఉండటం దుర్మార్గమన్నారు. కేరళలో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థగా ఉన్న హిందూస్తాన్ న్యూస్ ప్రింట్‌ను అమ్మడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నించిందని, దాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ సమర్థవంతంగా అడ్డుకున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఆ కంపెనీని నడపే సత్తా లేకపోతే తాము నడుపుతామని, దాన్ని తమ ప్రభుత్వానికే అమ్మాలని పినరయ్ విజయన్ స్పష్టం చేశారన్నారు. చంద్రబాబుకు దమ్ముంటే విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో అలాంటి ధైర్యం ప్రదర్శించాలని సవాల్ చేశారు. ఈ పాలకులు ప్రజల ఆస్తిని కాపాడకుండా అదానీ, అంబానీ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాక ఎమ్మెల్యే, విశాఖ ఎంపీ మాత్రం స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేశామంటూ అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు. వారికి నీతి, నిజాయితీ ఉంటే ఈ ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని ప్రధానమంత్రి మోదీతో ప్రకటన చేయించాలన్నారు. ఇటీవల విశాఖ వచ్చిన ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంట్ గురించి ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మోదీకి మద్దతు ఇస్తూ టీడీపీ తన రాజకీయ పునాదిని లేపేసుకుంటోందని పేర్కొన్నారు. టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారని, ఈ నేపథ్యంలో ప్రజలంతా ఒక్కతాటిపైకి రావాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ టీడీపీది మొదటి నుంచీ రెండు నాల్కల ధోరణేనని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు స్టీల్‌ప్లాంట్ ఉద్యమానికి పూర్తి మద్దతు తెలుపుతూ లేఖ రాశారని, అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చారన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సభ పెట్టుకోవడానికి కూడా అనుమతి నిరాకరించడం దుర్మార్గమని అన్నారు. విశాఖ ఎంపీ తన పదవిని నిలబెట్టుకోవడం కోసం బీజేపీకి అమ్ముడుపోయారన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను విస్మరించి ఆర్సీ మిట్టల్ కంపెనీకి గనులు అడగడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు ఎం.జగ్గునాయుడు, కె.లోకనాథం, ఎస్.పుణ్యవతి, రాజేశ్వరరావు, జగన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ చేరుకున్న నేపాల్ బాధితులు



గోపాలపట్నం : తీర్థయాత్రలకు వెళ్లి నేపాల్‌లో చిక్కుకున్న బాధితులు గురువారం విశాఖ చేరుకున్నారు. ఖట్మాండ్ నుంచి ప్రత్యేక విమానంలో మొత్తం 144 మంది విశాఖ వచ్చారు. ఇందులో 42 మంది విశాఖ ప్రాంతంవారు, 40 మంది రాయలసీమ, 34 మంది విజయనగరం, మిగిలిన వారంతా శ్రీకాకుళానికి చెందినవారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన 40 మందిని ఇక్కడి నుంచి తిరుపతికి వేరే విమానంలో పంపించారు. మిగతా 104 మందిని ప్రత్యేక వాహనాల ద్వారా వారి స్వగ్రామాలకు తరలించారు. వారికి విమానాశ్రయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, తదితరులు స్వాగతం పలికారు.















లగేజీలతో విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న నేపాల్ బాధితులు

హోటల్‌లోనే ఉండిపోయాం..

తీర్థయాత్రలకు వెళ్లి అన్ని ప్రాంతాలు చూశాం.. నేపాల్ నుంచి తిరుగు ప్రయాణమవుతున్న సమయంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో మేమంతా హోటల్‌లోనే ఉండిపోయాం. హోటల్ యజమాని మానవతా దృక్పథంతో మమ్మల్ని ఆదుకున్నాడు. ఫ్రీగా భోజనాలు పెట్టించాడు. అయితే మాతో వచ్చినవారు వేర్వేరు ప్రాంతాల్లో చిక్కుకుపోయారు. అందరం మళ్లీ కలుస్తామా.. ఇంటికి వెళ్లగలమా.. అని ఆందోళన చెందాం. బిక్కుబిక్కుమంటూ గడిపాం. దేవుడు దయ వల్ల విశాఖ చేరుకున్నాం.

– ఎయిర్‌పోర్టులో నేపాల్ బాధితులు

భయం వేసింది



నేను మా ఆవిడ, కోడలు, మా బంధువులు కలిపి మొత్తం మొత్తం 18 మంది ఈనెల 3న నేపాల్ బయలుదేరి వెళ్లాం. 5న అక్కడికి చేరుకున్నాం. ముక్తినాథ్, పశుపతినాథ్ తదితర ఆలయాలతో పాటు పలు ప్రాంతాలను సందర్శించాం. 9న ఖాట్మాండ్ వచ్చాం. అప్పటికే అక్కడ తీవ్రమైన అల్లర్లు చోటుచేసుకోవడంతో భయాందోళన చెందాం. అక్కడ మేము బస చేసిన హోటల్ యజమాని మమ్మల్ని లోపల ఉంచి గేట్లకు తాళాలు వేశారు. తిరిగి సింహాచలం వస్తామో లేదో అని భయం వేసింది. ఎట్టకేలకు అక్కడ ప్రత్యేక విమానం ఎక్కి గురువారం రాత్రికి విశాఖ చేరుకున్నాం.

– సిరిపురపు రమణ, సింహాచలం

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు చొక్కాకుల సూర్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన నాలుగు డీఏలు, పీఆర్సీ బకాయిలు చెల్లించకపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. దీంతో పాటు ఉపాధ్యాయులపై యాప్‌ల భారం, పని భారం పెంచి తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. దసరా లోపు కనీసం రెండు డీఏలైనా చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్‌లో ఉన్న లోన్లు, సరెండర్ లీవ్‌లు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే చెల్లించాలని, అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సచివాలయ ఉద్యోగుల సమ్మె నోటీసు



జెడ్పీ మల్లయ్యనాయుడుకి వినతి పత్రం ఇస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు

జగదాంబ: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు 15 రోజుల్లో పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ జేఏసీ వెల్లడించింది. ఈ మేరకు జోన్-4 కమిషనర్ మల్లయ్యనాయుడికి గురువారం నోటీసు అందజేసినట్లు జేఏసీ నాయకులు పీజే గణేష్‌కుమార్, పల్లా కిరణ్ కుమార్ యాదవ్, చింతకాయల బంగార్రాజు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికి వెళ్లి విధులు నిర్వహించడం అవమానాలకు గురిచేయడంతో పాటు, ఉద్యోగులు ఆత్మగౌరవానికి భంగం వాటిల్లుతుందని లేఖలో వివరించారు. ఉద్యోగుల సమస్యలు, హక్కులు, భద్రత, ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీవీ అశోక్‌కుమార్, నాగేశ్వరరావు, శ్రీకాంత్, రమేష్‌బాబు, చంద్రశేఖర్, రమేష్, నాగరాజు, నళిని, సంతోష్‌కుమార్, త్రివేణిరాజు ఉన్నారు.

పౌరుల సహకారంతో వీ-పుల్ బలోపేతం

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్: పట్టణ సమస్యలకు వినూత్న పరిష్కారాలు కనుగొనేందుకు ప్రజలను భాగస్వాములను చేయాలని జీవీఎంసీ నిర్ణయించింది. ఈ మేరకు 'వైజాగ్-ప్రజాముఖి అర్బన్ లివింగ్ ల్యాబ్ మోడల్'(వీ-పుల్) వ్యవస్థను బలోపేతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ గురువారం ఉన్నత స్థాయి అధికారులతో జరిగిన సమావేశంలో సూచించారు. బ్లూమ్‌బర్గ్ మేయర్స్ చాలెంజ్ 2025లో ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 50 ఫైనలిస్ట్ నగరాల్లో విశాఖపట్నం ఒకటిగా నిలవడం ఈ వ్యవస్థకు లభించిన అంతర్జాతీయ గుర్తింపు అని కమిషనర్ తెలిపారు. వీ-పుల్ వ్యవస్థను సంస్థాగతం చేయాలని నిర్ణయించామని, ఇది ప్రజలు, సంస్థలు, సాంకేతిక నిపుణులు ఒకే వేదికపైకి వచ్చి సహకారంతో పరిష్కారాలు కనుగొనేందుకు దోహదపడుతుందని వివరించారు. ప్రతి పౌరుడు ఈ వీ-పుల్ వేదిక ద్వారా తమ ఆలోచనలు, సూచనలు, సలహాలు పంచుకోవాలని కమిషనర్ కోరారు. సమష్టిగా పనిచేయడం ద్వారా బలమైన, సురక్షితమైన విశాఖను నిర్మించవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మ, ప్రధాన ఇంజినీర్ పీవీవీ సత్యనారాయణరాజు, సీసీపీ ఎ.ప్రభాకరరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్, యూసీడీ పీడీ పి.ఎం.సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

దుఃఖంలోనూ మానవత్వం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కళ్లు దానం



మృతుడు సతీష్ నేత్రాలు దానం చేసేందుకు అంగీకారం తెలుపుతున్న బంధువు. ప్రమాదంలో మరణించిన సతీష్

పెందుర్తి: బతుకుదెరువు కోసం ఊరికాని ఊరు వచ్చాడు. కొరియర్ సంస్థలో డెలివరీ బాయ్‌గా పని చేస్తూ భార్యాపిల్లలను పోషించుకుంటున్నాడు. అయితే ఓ బాలుడు ఆకతాయితనానికి రోడ్డు ప్రమాదానికి బలయ్యాడు. దీంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఆ విషాద సమయంలోనూ అతని కుటుంబం గొప్ప మనసు చాటుకుంది. మృతి చెందిన వ్యక్తి నేత్రాలను దానం చేసి ఇద్దరికి చూపునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. కె.కోటపాడు మండలం ఎ.కోడూరుకు చెందిన చీపురపల్లి సతీష్ (44) ఉపాధి నిమిత్తం తన భార్య వరలక్ష్మి, ఇద్దరు పిల్లలతో కలిసి కొన్నేళ్ల కిందట విశాఖపట్నం వచ్చాడు. నాయుడుతోటలో నివాసం ఉంటున్న సతీష్ ఒక కొరియర్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం డెలివరీలు ఇచ్చేందుకు పెందుర్తి-ఆనందపురం రోడ్డులో బైక్‌పై వెళ్తున్నాడు. అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో ఒక బాలుడు అతి వేగంగా నడుపుతున్న బైక్, సతీష్ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషాద వార్త తెలుసుకున్న కుటుంబం తీవ్ర శోకంలో మునిగిపోయింది. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సతీష్ భార్య వరలక్ష్మి, పిల్లల రోదనలు అక్కడున్న వారిని కదిలించాయి. సీఐ కె.వి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కష్ట సమయంలో సతీష్ కుటుంబ సభ్యులను పెందుర్తి పోలీసులు, స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి దాడి శ్రీను, మోహిన్ ఐ బ్యాంక్ ప్రతినిధి మనోజ్ నేత్రదానం కోసం సంప్రదించారు. తమ బాధను దిగమింగుకుని సతీష్ కుటుంబం నేత్రదానానికి అంగీకరించింది. విషాదంలోనూ వారు చూపిన ఈ మానవత్వం అందరి ప్రశంసలు అందుకుంది.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

పండగల వేళ రైల్వే ఏర్పాట్లు

తాటిచెట్లపాలెం: దసరా, దీపావళి పండగల సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆయా మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

- సంబల్‌పూర్-ఈరోడ్ (08311) వీక్లీ స్పెషల్ ప్రతి బుధవారం ఉదయం 11.35 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి, అదే రోజు రాత్రి 9.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. ఈ రైలు నవంబర్ 26 వరకు అందుబాటులో ఉంటుంది. ఈరోడ్-సంబల్‌పూర్ (08312) వీక్లీ స్పెషల్ ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు ఈరోడ్‌లో బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 1.08 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. ఈ రైలు నవంబర్ 28 వరకు నడుస్తుంది.
- విశాఖపట్నం-తిరుపతి (08583) వీక్లీ స్పెషల్ నవంబర్ 24వ తేదీ వరకు ప్రతి సోమవారం రాత్రి 7.10 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుపతి-విశాఖపట్నం (08584) వీక్లీ స్పెషల్ ప్రతి మంగళవారం రాత్రి 9.50 గంటలకు తిరుపతిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 11.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు నవంబర్ 25 వరకు అందుబాటులో ఉంటుంది.
- మధురై-బరౌని (06059) వీక్లీ స్పెషల్ ప్రతి బుధవారం రాత్రి 8.40 గంటలకు మధురైలో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 11.00 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. ఈ రైలు నవంబర్ 26 వరకు నడుస్తుంది. బరౌని-మధురై (06060) వీక్లీ స్పెషల్ నవంబర్ 29 వరకు ప్రతి శనివారం రాత్రి 11 గంటలకు బరౌనిలో బయలుదేరి, మూడవ రోజు తెల్లవారుజామున 4.25 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది.
- ఎంజీఆర్ చెన్నై-బరౌని (06039) వీక్లీ స్పెషల్ నవంబర్ 30 వరకు ప్రతి ఆదివారం రాత్రి 11.50 గంటలకు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌లో బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 2.50 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. బరౌని-ఎంజీఆర్ చెన్నై (06040) వీక్లీ స్పెషల్ డిసెంబర్ 3వ తేదీ వరకు ప్రతి బుధవారం రాత్రి 9 గంటలకు బరౌనిలో బయలుదేరి, మూడవ రోజు తెల్లవారుజామున 2.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది.
- త్రివేండ్రం నార్త్-సంత్రగచ్చి (06081) వీక్లీ స్పెషల్ ప్రతి శుక్రవారం సాయంత్రం 4.20 గంటలకు త్రివేండ్రం నార్త్‌లో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 10.50 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. ఈ రైలు అక్టోబర్ 17 వరకు నడుస్తుంది. సంత్రగచ్చి - త్రివేండ్రం నార్త్ (06082) వీక్లీ స్పెషల్ ప్రతి సోమవారం మధ్యాహ్నం 2.20 గంటలకు సంత్రగచ్చిలో బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారుజామున 4.18 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. ఈ రైలు అక్టోబర్ 20 వరకు అందుబాటులో ఉంటుంది.

వ్యవసాయ డిప్లమో కోర్సులకు 15న స్పాట్ కౌన్సెలింగ్

చింతపల్లి ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ అప్పలస్వామి



చింతపల్లి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 15న స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోగల పాలిటెక్నిక్ కళాశాలల్లో వ్యవసాయం, విత్తన సాంకేతిక పరిజ్ఞానం, సేంద్రియ వ్యవసాయం, వ్యవసాయ ఇంజినీరింగ్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు చివరి అవకాశం కల్పిస్తూ రిజిస్ట్రార్ నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేసుకున్న వారితో పాటు ఇప్పటి వరకూ రిజిస్ట్రేషన్ చేసుకోని అభ్యర్థులు కూడా ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చని ఆయన వివరించారు. తమ సేంద్రియ పాలిటెక్నిక్‌లో చేరేందుకు అల్లూరి, పరిసర జిల్లాల్లో ఆసక్తిగల విద్యార్థులు అన్ని ధ్రువపత్రాలతో ఈనెల 15వ తేదీన జరిగే స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు. గుంటూరు లాం ఫాం వ్యవసాయ పరిశోధన స్థానం కృష్ణా ఆడిటోరియంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు స్పాట్ కౌన్సెలింగ్ జరుగుతుందని ఏడీఆర్ తెలిపారు.

జిల్లాకు ఈ-పోస్ మిషన్లు

మహారాణిపేట : జిల్లాకు 642 న్యూ వెర్షన్ ఈ-పోస్ మిషన్లు చేరుకున్నాయి. వచ్చేనెల ఈ మిషన్ల ద్వారా నిత్యావసర వస్తువులు పంపిణీ చేయనున్నారు. వీటిని గురువారం డీఎస్‌వో భాస్కరరావు రేషన్ డీలర్లకు అందజేశారు. మిగతా డీలర్లు పాత మిషన్లు అప్పగించి డీఎస్‌వో కార్యాలయం నుంచి కొత్త మిషన్లు తీసుకోవాలని కోరారు.

వామపక్షాల ఐక్యతే ఏచూరికి నిజమైన నివాళి

- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ
- పీతాపురం కాలనీలో సీపీఎం జిల్లా కార్యాలయం ప్రారంభం



ఏచూరి భవనం ప్రారంభిస్తున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి బేబీ

మద్దిలపాలెం: ఆర్ఎస్ఎస్, నయా ఫాసిస్టు శక్తులను ఎదుర్కోవడానికి వామపక్ష భావజాలంతో కూడిన శక్తులు ఏకం కావాలని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ పిలుపునిచ్చారు. ఇదే సీతారాం ఏచూరికి సరైన నివాళి అవుతుందని ఆయన పేర్కొన్నారు. పీతాపురంకాలనీలో నూతనంగా నిర్మించిన సీపీఎం విశాఖ జిల్లా కార్యాలయం(సీతారాం ఏచూరి భవనం)ను గురువారం ఆయన ప్రారంభించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షత వహించిన సభలో బేబీ మాట్లాడారు. ఏచూరితో తమ 45 ఏళ్ల అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ.. దేశంలో పీడిత ప్రజలు, ఆదివాసీలు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై ఏచూరి దృక్పథం అగ్రగణ్యమైనదని కొనియాడారు. కులవివక్ష, కార్మిక పోరాటాలు ఉన్న ప్రతి చోటా ఎర్ర జెండా ఉండాలని బేబీ పిలుపునిచ్చారు. ఏచూరి పేరు మీద ఆధునికంగా జిల్లా కార్యాలయాన్ని నిర్మించిన పార్టీ శ్రేణులను అభినందించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ కార్యాలయం ఒక పోరాట కేంద్రమని, పీడిత ప్రజలు తమ కష్టాలను చెప్పుకోవడానికి, పోరాడడానికి శక్తిని పొందే నిలయమని పేర్కొన్నారు. ఏచూరి వర్ధంతి లోపు ఈ భవనాన్ని పూర్తిచేసి కమ్యూనిస్టు స్ఫూర్తిని చాటిచెప్పిన విశాఖ జిల్లా కమిటీని ఆయన అభినందించారు. కొత్త భవనంలో మీటింగ్ హాల్, గ్రంథాలయం, కుట్టుమిషన్ కేంద్రం, ఆరోగ్య కేంద్రం, కాన్ఫరెన్స్ హాల్‌ను కూడా ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, కె.లోకనాథం, మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ, పార్టీ సీనియర్ నాయకులు సి.హెచ్.నరసింగరావు, అజశర్మ, చంద్రశేఖర్, ఎం.వెంకటేశ్వర్లు, దేవా, ఆర్.కె.ఎస్.వి.కుమార్, బి.జగన్, బి.పద్మ, పి.మణి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

మహారాణిపేట: వైఎస్సార్ సీపీలో విశాఖ జిల్లాలో వివిధ విభాగాల్లో నూతనంగా నియమితులైన పలువురు పార్టీ జిల్లా అధ్యక్షుడు కే.కే.రాజును కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, డిప్యూటీ మేయర్ కటుమూరు సతీష్, జిల్లా పార్టీ ఆఫీస్ పర్యవేక్షకుడు రవిరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి తాడి జగన్నాథ్ రెడ్డి, కిరణ్ రాజు, కార్పొరేటర్ అనిల్ కుమార్‌రాజు, కో ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, అనుబంధ విభాగ అధ్యక్షులు అంబటి శైలేష్, సనపల రవీంద్ర భరత్, బొండా ఉమామహేష్, నాయకులు పులగమ శ్రీనివాస్ రెడ్డి, నాగేశ్వరరావు, సూర్య, బంద్ శ్రీను, దుప్పల శ్రీనివాస్, మహ్వాస్ గోపి, గౌస్, కురప్ప, రాఘవలు తదితరులు పాల్గొన్నారు

మేఫెయిర్ హోటల్ భూముల వివాదం

తహసీల్దార్ ఉత్తర్వులను రద్దు చేసిన హైకోర్టు

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం సర్వే నంబర్ 101/1లో పర్యాటకాభివృద్ధిలో భాగంగా మే ఫెయిర్ హోటల్‌కు 40 ఎకరాల భూమిని కూటమి ప్రభుత్వం కేటాయించింది. అయితే ఈ భూములపై భీమిలి తహసీల్దార్ జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు గురువారం రద్దు చేసిందని రైతుల తరపు న్యాయవాది సింగూరి మోహనరావు తెలిపారు. రిట్ పిటిషన్ నంబర్ 24446/2005 విచారణలో భాగంగా న్యాయస్థానం ఈ మధ్యంతర ఉత్తర్వులను వెల్లడించిందని పేర్కొన్నారు. రైతులకు హక్కులున్న ఈ భూములను అధికారులు వెంటనే ఖాళీ చేయాలని కోర్టు ఆదేశించిందన్నారు. ఈ ఉత్తర్వులను కలెక్టర్, భీమిలి ఆర్డీవో, తహసీల్దార్, డ్వామా, పోలీసులు సహా ఏడు ప్రభుత్వ విభాగాలకు కోర్టు పంపించిందన్నారు. భీమిలి తహసీల్దార్ పి.రామారావు ఈ నెల ఒకటిన ఆర్.సి.నంబర్ 642/2025తో ఈ భూములకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారని న్యాయవాది వివరించారు. 25 ఏళ్ల కిందట కార్పొరేట్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా తమ క్లయింట్లు అయిన 28 మంది డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం 14 ఎకరాలు కేటాయించిందని, ప్రస్తుతం వారు అక్కడ తోట పంటలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. కాగా.. ప్రభుత్వం తరపున తహసీల్దార్ కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసుపై రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అయితే కోర్టు నుంచి హార్డ్ కాపీ అందిన తర్వాతే పనులు ఆపేస్తామని ఇక్కడి అధికారులు తెలిపారు. మే ఫెయిర్ హోటల్‌కు సంబంధించిన భూములపై భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్ ప్రెస్‌మీట్ నిర్వహిస్తున్నట్టు తొలుత సమాచారం అందించి, ఆ తర్వాత రద్దు చేసుకున్నారు.

విశాఖలో ముగిసిన ప్రో కబడ్డీ లీగ్

విశాఖ స్పోర్ట్స్: నగరంలోని పోర్టు ఇండోర్ స్టేడియం వేదికగా జరుగుతున్న ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్ తొలి దశ మ్యాచ్‌లు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. చివరి రోజైన గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో దబాంగ్ ఢిల్లీ తన జైత్రయాత్రను కొనసాగించగా, మరో మ్యాచ్‌లో యు ముంబ ఉత్కంఠ నడుమ విజయాన్ని అందుకుంది. ఈ సీజన్‌లో అప్రతిహతంగా దూసుకెళ్తున్న దబాంగ్ ఢిల్లీ వరుసగా ఐదో విజయాన్ని నమోదు చేసి పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 38-28 తేడాతో ఢిల్లీ ఘన విజయం సాధించింది. కెప్టెన్ అషు మాలిక్ (14 పాయింట్లు) మరోసారి జట్టును ముందుండి నడిపించగా, డిఫెండర్లు కూడా రాణించడంతో ఢిల్లీ సునాయాసంగా గెలిచింది. ఈ ఓటమితో గుజరాత్ జెయింట్స్ పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. మాజీ చాంపియన్ల మధ్య జరిగిన మరో హోరాహోరీ పోరులో.. యూ ముంబ 40-39 తేడాతో పాట్నా పైరేట్స్‌పై థ్రిల్లింగ్ విక్టరీ సాధించింది. ఆఖరి నిమిషం వరకు నువ్వా-నేనా అన్నట్లు సాగిన ఈ మ్యాచ్‌లో ముంబ ఒక్క పాయింట్‌తో గట్టెక్కింది. ముంబ తరపున ఆల్‌రౌండర్లు అమీర్‌మహ్మద్ (12), అనిల్ (9) రాణించారు. పాట్నా స్టార్ రైడర్ అయాన్ (21 పాయింట్లు) ఒంటరి పోరాటం చేసినా, జట్టును గెలిపించలేకపోయాడు. ఈ విజయంతో యూ ముంబ పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరింది.

'సెయింట్ జోసెఫ్' ప్రపంచ రికార్డు

11.19 లక్షల సీడ్ బాల్స్ తయారీ



సర్టిఫికెట్, ప్రశంసాపత్రంతో సెయింట్ జోసెఫ్ సిస్టర్స్, అధ్యాపకులు

కంచరపాలెం: పర్యావరణ పరిరక్షణలో సెయింట్ జోసెఫ్ సిస్టర్స్ ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. సెయింట్ జోసెఫ్ కాంగ్రిగేషన్ 375వ వార్షికోత్సవం సందర్భంగా 11.19 లక్షల సీడ్ బాల్స్‌ను తయారు చేసి ప్రపంచ రికార్డు సాధించారు. సెయింట్ జోసెఫ్ ఆఫ్ అన్నసీ సిస్టర్స్, విశాఖ ప్రావిన్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ప్రపంచ రికార్డు సాధన లక్ష్యంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ కళాశాల, సెయింట్ జోసెఫ్ బాలికల పాఠశాలలో సీడ్ బాల్స్ తయారీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న 16 సెయింట్ జోసెఫ్ విద్యా సంస్థలు పాల్గొని.. మొత్తం 11.19 లక్షల సీడ్ బాల్స్‌ను తయారు చేశాయి. ఒక్క జ్ఞానాపురం కళాశాల నుంచే 3,253 మంది విద్యార్థులు పాల్గొని 1,93,534 సీడ్ బాల్స్‌ను తయారు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వరల్డ్ రికార్డ్స్ అధికారులు అన్ని విద్యా సంస్థల్లో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షించారు. పర్యావరణ పరిరక్షణ, పునరుద్ధరణ, సుస్థిర భవిష్యత్తు కోసం ఇది ఒక గొప్ప ముందడుగు అని వారు అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల సిస్టర్ షైజీ మాట్లాడుతూ.. మొక్కలు నాటడమే కాకుండా, చక్కని భవిష్యత్తు కోసం విత్తనాలను నాటనున్నట్లు తెలిపారు. అనంతరం వరల్డ్ రికార్డ్స్ అధికారి డాక్టర్ షరీఫా హనీఫ్ చేతుల మీదుగా అవార్డు, సర్టిఫికెట్‌ను అందుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ హేమ, ప్రావిన్షియల్ సుపీరియర్ సిస్టర్ రోజ్, ఆఫీస్ సిస్టర్స్ మేరీ, నాన్సీ, డైసీ, కళాశాల పీఆర్వో డాక్టర్ పి.కె.జయలక్ష్మి పాల్గొన్నారు.